సాక్షి శ్రీకాకుళం

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024

సమ్మె వాయిదా



ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో వరదలు కొనసాగుతుండటం, ప్రభుత్వం చర్చలకు పిలవటంతో ఈ నెల 7న నిర్వహించాల్సిన ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమ్మెను వాయిదా వేసుకుంది. ఈ మేరకు ఎచ్చెర్లలోని బేవరేజెస్ కార్పొరేషన్ డిపో మేనేజర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావుకు బంద్ విరమణ నోటీస్‌ను బుధవారం కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ అధ్యక్షులు పి.రామచంద్రరావు, ఉపాధ్యక్షులు ఎస్.భాస్కర్, జనరల్ సెక్రటరీ జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు నుంచి కొత్త మద్యం పాలసీ

శ్రీకాకుళం క్రైమ్/ఎచ్చెర్ల: కొత్త మద్యం పాలసీ అక్టోబరు 1 నుంచి అమల్లోకి వస్తుందని, సెబ్ విభాగం ఎక్సైజ్‌లో విలీనమవుతుందని, అంతా సర్దుకున్నాక బదిలీల ప్రాసెస్ మొదలవుతుందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) బి.సుబ్బారావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్వార్టర్ రూ.80, రూ.90లకు చీప్ లిక్కర్ లభించేలా కొత్త మద్యం పాలసీ ఉంటుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇసుక ర్యాంపులో నిబంధనల ఉల్లంఘనపై ఆరా



ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

బూర్జ: మండలంలోని మామిడివలస పంచాయతీ కాఖండ్యాం ఇసుక ర్యాంపులో నిబంధనల ఉల్లంఘనపై గుత్తావల్లి గ్రామానికి చెందిన నాయకుడు సనపల సురేష్‌కుమార్ కలెక్టర్‌కు ఇచ్చినా ఫిర్యాదు మేరకు బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. మైన్స్, పోలీసు, రెవెన్యూ అధికారుల కమిటీ బూర్జ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదుదారుతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ర్యాంపు వద్ద ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం కాఖండ్యాం ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లి పరిశీలన జరిపారు. ఖాళీ వాహనాలు సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్.రంగయ్య, డీడీ మైన్స్ ఎస్.కె.వి.సత్యనారాయణ, శ్రీకాకుళం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, పాతపట్నం తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎస్సై ఎం.ప్రవళిక పాల్గొన్నారు.

వరం సేవలు చిరస్మరణీయం



చిరువ్యాపారులకు తోపుడుబండ్లు అందిస్తున్న వరం కుటుంబ సభ్యులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సిక్కోలు రాజకీయాలు, వ్యాపారాల్లో అంధవరపు వరహా నర్సింహం (వరం) ఓ బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టించారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం వరం జయంతి సందర్భంగా నగరంలోని అంధవరపు వరహా నర్సింహం హైస్కూల్, ఏడురోడ్ల కూడలిలోని ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. 15 మంది నిరుపేదలకు తోపుడు బండ్లను కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, అంధవరపు ప్రసాద్, సంతోష్, కోరాడ హరగోపాల్, జామి భీమశంకర్, పీఎంజే బాబు, పాండ్రంకి శంకర్, పి.వి.రమణ, కొర్ను ప్రతాప్, అంబటి లక్ష్మీరాజ్యం, అరవల రవీంద్ర, మాదారపు వెంకటేష్, మెండ దాసునాయుడు, నాగేంద్రయాదవ్, కెల్ల కొండలరావు, సిరిపురపు హరి, అర్జున్ జనసేన నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, పైడి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు బ్లాక్ చేస్తే డీలర్ల లైసెన్స్ రద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: భవిష్యత్ అవసరాల నిమిత్తం అధికారులు ఎరువులను ముందస్తుగా నిల్వ చేయాలని, ఇదే సమయంలో డీలర్లు ఎరువులను బ్లాక్ చేస్తే లైసెన్సులు రద్దు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గత నెల 28న జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేలు, ఇతర సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్ లక్ష్యం 61,262 టన్నులు కాగా లక్ష్యానికి మించి 65,007 టన్నులు సరఫరా చేశామన్నారు. గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకు పరిష్కారం చూపి, స్పష్టమైన లిఖిత పూర్వక సమాధానాలు ఇవ్వాలని వ్యవసాయాధికారులకు ఆదేశించారు. సీఆర్‌జెడ్ నిబంధనలకు లోబడే తీరప్రాంత గ్రామాలలో భూముల రిజిస్ట్రేషన్లు జరగాలని ఆదేశించారు. బీఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టు, నీటిపారుదల శాఖల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. పలు నిబంధనలు కారణంగా కరువు మండలాలుగా ప్రకటించే అవకాశం లేని మండలాలకు పంటల బీమాను వర్తింపచేయాలని ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డీసీఓ నగేష్, డీఎంహెచ్ఓ డాక్టర్ మీనాక్షి, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మథరావు, వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్‌రావు, డ్వామా పీడీ ఎన్.వి.చిట్టిరాజు, డీఈఓ తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దేవుడ్ని చేస్తున్న మనుషులు



మట్టి గణపతిని తయారు చేస్తున్న కోల్‌కతా కళాకారుడు శివ



- తుది మెరుగులు దిద్దుకుంటున్న గణపయ్య విగ్రహాలు
- మట్టి గణపతుల తయారీకి పొరుగు రాష్ట్రాల నుంచి కళాకారులు
- పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతిమలను సిద్ధం చేయిస్తున్న నిర్వాహకులు

మా అదృష్టం..

విగ్రహాల తయారీ మా పూర్వజన్మ సుకృతం. పర్యావరణ హితమైన విగ్రహాలనే తయారు చేస్తాం. మొత్తం పదిమంది సభ్యుల బృందం.. కోల్‌కతానుంచి మూడు నెలల క్రితం నరసన్నపేటకు వచ్చాం. ఈ ఏడాది మేం తయారు చేసిన వాటిలో 18 అడుగుల ఎత్తైన గణపతి ప్రత్యేకాకర్షణ. –శివ, శిల్పి, కోల్‌కతా

శ్రీకాకుళం కల్చరల్/కాశీబుగ్గ/నరసన్నపేట/సారవకోట/కంచిలి/మెళియాపుట్టి:

మనుషులు దేవుడ్ని చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ మంత్రాలతో మృణ్మయనాథుడి మూర్తులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ఒడిశా, కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారుల తమ కళతో ఆదిదేవుడి రూపానికి ప్రాణం పోస్తున్నారు. భారీ మట్టి గణపతుల విగ్రహాలను తొమ్మిది రోజుల పాటు పూజించేందుకు వాడవాడలా భారీ మండపాలను నిర్వాహకులు సిద్ధం చేశారు.

పెరిగిన పర్యావరణ స్పృహ..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడకంతో జలవనరుల కాలుష్యం అవుతుండడంతో ఈ ఏడాది చాలా వరకు మట్టిగణపతుల విగ్రహాల ఏర్పాటుకే ప్రాధాన్యం ఇచ్చారు. ఇళ్లలో కూడా పూజించేందుకు మట్టి గణపతుల ప్రతిమల్ని చాలా సంస్థలు, కొందరు వ్యక్తులు ఉచితంగా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. గతంలో గణపయ్య విగ్రహ తయారీకి సంబంధించిన మట్టి, గడ్డిని నిర్వాహకులే అందజేసేవారని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు తయారీ దారులు. ట్రాక్టర్ మట్టి రూ.2000 వరకు ఖర్చవుతోందని.. గడ్డికి కూడా రూ.వెయ్యి వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మెళియాపుట్టిలో గణనాథుని విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

తరతరాలుగా..



మా తాతల కాలం నుంచి విగ్రహాల్ని తయారు చేస్తున్నాం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దీటుగా మట్టి బొమ్మలు తయారు చేస్తున్నాం. ఏటా ఖర్చు పెరుగుతోంది. లాభాల మాట అటుంచితే తయారు చేసిన బొమ్మలు అమ్ముడైతే చాలని భావిస్తున్నాం. – వెంకటరావు, తయారీదారుడు, శ్రీకాకుళం

పలాసలో 21 అడుగులు...



తిలక్‌నగర్‌లో సిద్ధమవుతున్న 21 అడుగుల వినాయక విగ్రహం

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు తిలక్‌నగర్ మంకినమ్మ ఆలయానికి సమీపంలో 21 అడుగుల భారీ మట్టిగణపయ్య విగ్రహం రూపొందిస్తున్నారు. ఒడిశాలోని కటక్ ప్రాంతానికి చెందిన నలుగురు శిల్పులు 15 రోజులుగా భారీ గణపయ్య విగ్రహాన్ని తయారుచేస్తున్నారు. రెండు లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఈ విగ్రహాన్ని మండపంలోనే నిమజ్జనం చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తూ..



మా పూర్వీకుల నుంచి మట్టి విగ్రహాల తయారీని వృత్తిగా స్వీకరించాం. ప్లాస్టిక్, హానికారక రసాయనాలను విగ్రహాల తయారీలో మేము వినియోగించం. 21 అడుగుల తయారీ విగ్రహానికి మాకు పదిరోజులకు పైగానే సమయం పడుతుంది. – మనోజ్ నాయక్, శిల్పి, కటక్, ఒడిశా

గంగా నది మట్టితో..



నరసన్నపేటలో సిద్ధమవుతున్న 18 అడుగుల మట్టి విగ్రహం

కోల్‌కతాకు చెందిన కళాకారుల బృందం నరసన్నపేటలో మట్టి విగ్రహాల తయారీకి శ్రీకారం చుట్టింది. మూడు నెలల నుంచి వివిధ సైజుల్లో విగ్రహాల్ని రూపొందిస్తున్నారు. మండపాల నిర్వాహకుల అభిరుచుల మేరకు విభిన్న విగ్రహాలను తయారు చేస్తున్నారు. శివ నేతృత్వంలో 10 మంది శిల్పుల బృందం నరసన్నపేటలోని పైడితల్లి ఆలయ సమీపంలో ఈ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది తయారైన విగ్రహాల్లో 18 అడుగుల ఎత్తైన గణపయ్య ఆకృతి హైలైట్. దీనిని గార మండలం ఒమ్మరివల్లి వాసులు ఆర్డర్ చేసినట్లు తయారీ దారులు తెలిపారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం మిడ్నాపూర్, కోల్‌కతా ప్రాంతాలకు చెందిన అరుణ్‌కుమార్ సారథ్యంలో 20 మంది కళాకారులు కంచిలిలోనూ మట్టి వినాయక విగ్రహాలను రూపొందిస్తున్నారు. సుమారు 3 నెలలుగా స్థానికంగా లభించిన మట్టి, గడ్డి సాయంతో ప్రాథమిక దశలో విగ్రహాన్ని తయారు చేసి, ఫినిషింగ్‌కు మాత్రం కోల్‌కతా గంగానది నుంచి తీసుకొచ్చిన మట్టితోనే పూర్తి చేయడం ఇక్కడ విశేషం.

వినియోగించేవి ఇవే..

మట్టి గణపతుల తయారీకి ఎక్కువగా ఒంద్రు మట్టి, గడ్డి, చొప్ప గడ్డిని వినియోగిస్తున్నారు. ఇవి పూర్తిగా పర్యావరణహితమైనవి. జల వనరులను కలుషితం కానివ్వవని చెబుతున్నారు తయారీ దారులు.

20 ఏళ్లుగా మట్టి విగ్రహాల తయారీలో..

మెళియాపుట్టి మెయిన్ రోడ్ ప్రాంతంలో నివాసముంటున్న పలు కుటుంబాలు 20 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. వీరి పనితనం మెచ్చి చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చి విగ్రహాలు కొనుగోలు చేస్తుంటారు.

మాస్టార్లకు వందనాలు

- జిల్లాస్థాయి అవార్డులకు 78 మంది ఉపాధ్యాయుల ఎంపిక
- నేడు గురుపూజోత్సవం సందర్భంగా సత్కారం



జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని సంతబొమ్మాళి మండలం బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం 'గురు' అక్షరాకృతిలో కూర్చున్నారు. ఉపాధ్యాయులపై తమ భక్తిని ఇలా చాటుకున్నారు. – సంతబొమ్మాళి

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం:

గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను జిల్లా విద్యాశాఖ బుధవారం ప్రకటించింది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఏకంగా 78 మంది ఉపాధ్యాయులను జిల్లాస్థాయి బెస్ట్ టీచర్లగా ఎంపికచేసింది. 2022లో 18 మంది, 2023 లో 39 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేశారు. ఈ ఏడాది 78 మందికి ఎంపిక చేయడం గమనార్హం. ఇందులో ప్రధానోపాధ్యాయులు 9 మంది, స్కూల్ అసిస్టెంట్లు 32 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 27 మంది, పీడీ/పీఈటీలు 8 మంది, కేజీబీవీ టీచర్లు ఇద్దరు ఉన్నారు.

మెజారిటీ పైరవీలకే!

మెజారిటీ టీచర్లకు విద్యాశాఖ ఉన్నతాధికారులతో వివిధ రూపాల్లో పైరవీల ద్వారా అవార్డులు లభించినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన జాబితాలను అవార్డుల లిస్టులో చేర్చినట్టు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులే ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఎన్నడూ లేనంతగా ఈ స్థాయిలో అవార్డు జాబితాలో ఉపాధ్యాయులను చేర్చడం వెనుక మర్మమేంటో అధికారులకే ఎరుక..? అంటూ సోషల్‌మీడియాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

నేడు అవార్డుల ప్రదానం..

గురువారం శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం సమీపంలోని అంబేడ్కర్ ఆడిటోరియం వేదికగా ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులను, ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. ముఖ్య ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు హాజరుకానున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఎంపికైన ఉపాధ్యాయులు ఉదయం 8 గంటలకు వేదిక వద్దకు చేరుకోవాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు.

చాక్లెట్ గణేష్



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కంపోస్టు కాలనీకి చెందిన ఆర్టిస్టు లాల్ ప్రసాద్ చాక్‌లెట్లను ఉపయోగించి వినాయకుడిని తయారు చేశారు. ఇందుకోసం 38 కేజీల చాక్‌లెట్లను వినియోగించానని, స్వగ్రామమైన అంపోలుకు ఈ గణనాథున్ని పంపుతానని ప్రసాద్ తెలిపారు.

రూ.500 నోట్లకు బదులు రూ.100 నోట్లు

పలాసలో ఏటీఎం మెషీన్ ద్వారా రూ.500 నోట్లకు బదులుగా రూ.100 నోట్లు రావడంతో వినియోగదారులు విస్తుపోయారు. పలాస పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బళ్ల సుభాష్‌బాబు బుధవారం మధ్యాహ్నం తన ఎస్‌బీఐ ఏటీఎం కార్డుతో కరూర్‌వైశ్య బ్యాంకు ఏటీఎం కేంద్రానికి వెళ్లారు. రెండుసార్లు రూ.10 వేలు చొప్పున రూ.20 వేలు తీయగా రూ.500 నోట్ల మధ్య మూడు రూ.100 నోట్లు వచ్చాయి. మొత్తం విలువలో రూ.1200 తగ్గడంతో వెంటనే పలాస కరూర్‌వైశ్య బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. – కాశీబుగ్గ



రూ.500 నోట్ల మధ్యలో వచ్చిన రూ.100 నోట్లు ఇవే

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పోలుమహంతి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కొత్త అధ్యక్షుడిగా పోలుమహంతి ఉమామహేశ్వరరావును ఎంపిక చేశారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఉమామహేశ్వరరావు శ్రీకాకుళం జూనియర్ చాంబర్ (జేసీఐ) అధ్యక్షులుగా సేవలందించి, ప్రస్తుతం జేసీస్ సీనియర్ మెంబర్ అసోసియేషన్ అధ్యక్షునిగా, వాకర్స్ గవర్నర్‌గా, రెడ్ క్రాస్ జీవితకాల సభ్యునిగా వ్యవహరిస్తున్నారు.

అవయవదానంతో పునర్జన్మ



బాలరాజు

తాను చనిపోతూ అవయవదానం చేసి నలుగురిని బతికించారు సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర పంచాయతీ గొల్ల సీతాపురం గ్రామానికి చెందిన బొమ్మాళి బాలరాజు. టెక్కలి పంచాయతీ కార్యాలయ పరిధిలో కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసిన బాలరాజు.. గత నెల 31న విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. రాగోలు జెమ్స్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో బాలరాజు అవయవాలు దానం చేయడానికి కుటుంబసభ్యులు ముందుకువచ్చారు. రెండు కిడ్నీలను విశాఖ కేర్‌కు, లివర్‌ను విశాఖ మెడికవర్‌కు తరలించారు. ఈయనకు భార్య ధనలక్ష్మీ, కుమార్తె ఉన్నారు. – సంతబొమ్మాళి/శ్రీకాకుళం రూరల్



కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందిస్తున్న జెమ్స్ ప్రతినిధులు

ఆపద్బాంధవులు



రెడ్‌క్రాస్ ద్వారా సేకరించిన ఆహార కిట్ల రథాన్ని జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్



కోర్టు ఆవరణలో విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నేతలు

శ్రీకాకుళం కల్చరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం దాతలు ముందుకొస్తున్నారు. తమకు చేతనైన సాయం చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ స్థానికంగా సేకరించిన ఆహార కిట్ల రథాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. రూ.5.50లక్షల విలువైన కిట్లను పంపించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఎం.వి.రమణమూర్తి చారిటబుల్ వెల్‌ఫేర్ సొసైటీ, సి.వి.నాగజ్యోతి వెల్ఫేర్ సొసైటీ, మళ్లా చక్రవర్తి కుటుంబ సభ్యులు, న్యూసెంట్రల్ స్కూల్, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, వరం చారిటబుల్ ట్రస్టు, డాక్టర్ నిక్కు అప్పన్న, దుర్గా దీరజ్ చారిటబుల్ ట్రస్టు, బి.చిన్మయరావు, రాజాం పట్ట చిట్టిబాబు, కిరణ్, సీనియర్ సిటిజన్లు వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ కె.దుర్గ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం పాతబస్టాండ్: వరద బాధితులకు సాయం చేసేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కోర్టు ఆవరణలో న్యాయవాదుల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.నాగమణి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం పాతబస్టాండ్: వరద ముంపు బాధితులకు విశ్రాంత తహసీల్దార్ సీహెచ్ సుభాషిని తన వంతుగా రూ. పది వేల ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ రెవెన్యూ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.రజనీకాంతరావు పాల్గొన్నారు.
- సంతబొమ్మాళి: తెలుగు రాష్ట్రాలలోని వరద బాధితులకు జై భారత్ నేషనల్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బైపిల్లి పరమేశ్వరరావు విరాళం అందజేశారు ఏపీ సీఎం సహాయ నిధికి రూ.లక్ష, తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ.50వేలు విరాళంగా అందజేశారు.

క్రీడలకు మరింత ఆదరణ పెరగాలి



ఉత్సాహంగా సాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో క్రీడలకు మరింత ఆదరణ పెరగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావుతో కలిసి ఆయన బుధవారం జూనియర్ స్టేట్ బాడ్మింటన్ టోర్నీ మెయిన్ డ్రా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ ఇండోర్ మైదానంలో ఏపీబీఏ, బాయ్ సౌజన్యంతో శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్రస్థాయి బాలబాలికల జూనియర్స్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీలు ఈనెల 3న ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలిరోజు మంగళవారం క్వాలిఫైయింగ్ రౌండ్స్ పోటీలు జరగగా.. బుధవారం మెయిన్ డ్రా పోటీలు మొదలయ్యాయి. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ సంఘ జిల్లా చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, తెలుగుయువత జిల్లా అధ్యక్షులు మెండ దాసు నాయుడు, ఏపీబీఏ సీఈఓ చుక్కా శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మ చౌదరి, బాడ్మింటన్ సంఘ జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈవో సంపతిరావు సూరిబాబు, ఉపాధ్యక్షులు ఎంఎం విలేకరి, మార్ని రత్నాజీ, గురుగుబెల్లి ప్రసాద్, మదినీ శైలానీ, అనీల్, శాంతికుమార్ ఎంవీ రమణ, నాయకులు పి.జయంతి, మాదారపు వెంకటేష్, గీతాశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. విశాఖ, కృష్ణ జిల్లాల క్రీడాకారులు ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. చీఫ్ రిఫరీ టి.కృష్ణప్రసాద్, డిప్యూటీ రిఫరీ బి.వెంకటేశ్వరరావు పోటీలను పర్యవేక్షిస్తున్నారు.